kalamdaily.com

# కలం
ప్రజల గళం...

బుధవారం
25-03-2026
పేజీలు: 2

Follow on:
Kalamtelugu

360° SINGLE TOPIC
యూరియా

భారత్‌లో యూరియా వినియోగం ఏటికేడు పెరుగుతున్నది. దేశీయంగా ఉత్పత్తి ఉన్నా డిమాండ్‌కు సరిపడా లేదు. దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తున్నది. ఇప్పుడు ఇరాన్ యుద్ధం ఎఫెక్ట్.. ఎల్ఎన్‌జీ సరఫరాలో ఆటంకాలు.. పూర్తిస్థాయిలో నడవని యూరియా ఉత్పత్తి ప్లాంట్లు.. సగానికి పడిపోయిన ప్రొడక్షన్.. వ్యవసాయానికి ఎలాంటి ఆటంకాలు రానివ్వబోమని ప్రధాని మోదీ, సీఎం రేవంత్ చెప్తున్న మాటలు.. అయినా రైతుల్లో ఆందోళన.. పాలకులు చెప్తున్న భరోసా మాటల వెనుక ఎక్కడో సంక్షోభం రానుందన్న కలవరం!!

మరో రెండు నెలల్లో వానాకాలం సీజన్.. తొలకరి పడితే వరి నాట్లు వేయాలంటే యూరియా ఉండాల్సిందే. కానీ ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న బఫర్ స్టాక్ అంతంతే. ఇప్పటికే యుద్ధం కారణంగా నెల రోజుల నుంచి ప్రొడక్షన్ భారీగా తగ్గింది. రాబోయే రెండు నెలల్లో చేసుకునే ఉత్పత్తి, దిగుమతులే ఆధారం. పంట సీజన్ మొదలైన ప్రతిసారి రాష్ట్రంలో యూరియా కోసం రైతుల అరిగోస.. ఎరువుల షాపుల ముందు, సహకార సంఘాల ముందు క్యూలు కనిపిస్తుంటాయి. ఇప్పుడు ప్రొడక్షన్ కూడా తగ్గిపోవడంతో మున్ముందు ఎలా ఉంటుందో తెలియని అయోమయం.

దేశ, రాష్ట్ర అవసరాలకు కావాల్సిన యూరియా ఎంత? ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రం వద్ద ఉన్న బఫర్ స్టాక్ ఎంత? వచ్చే రెండు నెలల్లో ఉత్పత్తి అయ్యేది ఎంత? ఎంతమేర ఉత్పత్తి చేస్తే, ఎన్ని టన్నులు దిగుమతి చేసుకుంటే దేశ అవసరాలకు సరిపోతుంది? యుద్ధం వల్ల ఎరువుల ఉత్పత్తిలో వచ్చిన ఆటంకాలు ఏమిటి?.. వీటన్నింటిపై కలం 360 డిగ్రీస్ స్పెషల్..

– కలం, సెంట్రల్ డెస్క్



# ఇరాన్ వార్..
# యూరియా క్రైసిస్!



## ఉత్పత్తి, దిగుమతులపై తీవ్ర ప్రభావం
## కేంద్రం, రాష్ట్రం వద్ద ఉన్న బఫర్ స్టాక్ తక్కువే..
## రెండు నెలల్లో సెట్ కాకపోతే సంక్షోభమే!
## ప్రధాని, సీఎం కామెంట్లతో రైతుల్లో ఆందోళన

### ఉత్పత్తి 50% డౌన్

దేశంలో గత కొన్ని రోజులుగా యూరియా ఉత్పత్తి దాదాపు 50 శాతం డౌన్ అయింది. ఇరాన్ యుద్ధ ప్రభావంతో గ్యాస్ సరఫరా నిలిచిపోయి ఉత్పత్తి ఆగిపోయింది. యూరియా ప్లాంట్లలో ప్రధానంగా లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) వినియోగిస్తారు. ఎల్ఎన్‌జీ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతున్నది. దాదాపు 75 శాతం ఇంపోర్ట్ చేసుకుంటున్నది. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎల్ఎన్‌జీ సప్లయ్‌లో అంతరాయం ఏర్పడింది. దీంతో యూరియా ప్లాంట్లకు గ్యాస్ సరఫరాను ఆయిల్ సంస్థలు తగ్గించాయి. ఫలితంగా యూరియా ఉత్పత్తి సగం వరకు తగ్గింది. ఇప్పుడు యుద్ధం ముగిసినా.. ఎల్ఎన్‌జీ సప్లయ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కావడానికి, అది ప్లాంట్లకు చేరి యూరియా ఉత్పత్తి పెరగడానికి టైమ్ పట్టే అవకాశం ఉంది. అలాగే ఇన్ని రోజులు నష్టపోయిన ఉత్పత్తిని భర్తీ చేయాలంటే మరింత సమయం పడుతుంది. వానాకాలం లోపు ఇవన్నీ సజావుగా జరిగితేనే యూరియా కొరత ఉండదు. లేదంటే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



## తెలంగాణకు కావాల్సింది.. 11 లక్షల టన్నులు!

- తెలంగాణలో వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే నాటికి కనీసం 5 లక్షల టన్నుల యూరియా అవసరం. ఈ బఫర్ స్టాక్ ఉంటేనే రైతులకు సరఫరా చేయడానికి ఇబ్బందులు ఉండవు.
- గత వానాకాలంలో రాష్ట్రంలో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా 67 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.
- గత సీజన్ తరహాలోనే ఈసారీ పంటలు సాగైతే, మొత్తం దాదాపు 11 లక్షల టన్నుల యూరియా అవసరం.
- రామగుండం ఫర్టిలైజర్స్ కంపెనీ (ఆర్ఎఫ్‌సీఎల్)లో ప్రస్తుతం 50 వేల టన్నుల యూరియా మాత్రమే నిల్వ ఉంది.
- ఇక్కడ ఏటా 12 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేయొచ్చు. ఇందులో 45% తెలంగాణకు కేటాయింపులు ఉన్నాయి.
- ప్రస్తుతం గ్యాస్ కొరత కారణంగా ఆర్ఎఫ్‌సీఎల్‌లో పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. ఇప్పుడున్న లెక్కన ఉత్పత్తి అయితే జూన్ నెలాఖరు వరకు దాదాపు 2.5 లక్షల టన్నుల బఫర్ స్టాక్ మాత్రమే ఉండే అవకాశం ఉంది.

### కొరత రాకుండా చర్యలు

యుద్ధం నేపథ్యంలో వానాకాలం సీజన్‌లో యూరియా సమస్యలు ఉత్పన్నమవుతాయనే ఉద్దేశంతో కేంద్రం అధికంగా యూరియా కేటాయించేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నాం. రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేసే యూరియా మొత్తాన్ని రాష్ట్రానికే కేటాయించాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించాం. ఇందుకోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ప్రధాని మోదీని కలవాలి.

- సీఎం రేవంత్ రెడ్డి



### కోలుకోవడానికి టైమ్ పడుతుంది..

పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎనర్జీ సంక్షోభం నెలకొన్నది. భారత్‌కు వచ్చే పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల దిగుమతులపై ఎఫెక్ట్ పడుతున్నది. పశ్చిమాసియాలో ఇప్పటికే జరగాల్సిన విధ్వంసం జరిగింది. దాని నుంచి ప్రపంచం కోలుకోవడానికి టైమ్ పడుతుంది. ఆ ప్రభావం భారత్‌పై వీలైనంత తక్కువగా ఉండేలా చూస్తాం. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం.

- ప్రధాని నరేంద్ర మోదీ



### ఫర్టిలైజర్స్ వినియోగంలో భారత్ సెకండ్..

- ఫర్టిలైజర్స్ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. ఫస్ట్ ప్లేస్ చైనా.
- డీఏపీ, యూరియా దిగుమతుల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది.
- దేశంలో వినియోగమయ్యే ఎరువుల్లో 60 శాతం డీఏపీ, 20 శాతం యూరియా, 15 శాతం ఎన్‌పీకేను దిగుమతి చేసుకుంటున్నాం.
- దేశంలో ఫర్టిలైజర్స్ తయారీ కోసం కొన్ని ముడి పదార్థాలనూ ఇంపోర్ట్ చేసుకుంటున్నది. వీటిలో రాక్ ఫాస్పేట్, ఫాస్పరిక్ యాసిడ్, పొటాష్ తదితర ఉన్నాయి.
- ఒమన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా, రష్యా, మొరాకో, జోర్డాన్, ఇజ్రాయెల్, కెనడా తదితర దేశాల నుంచి భారత్ ఎరువులు దిగుమతి చేసుకుంటున్నది. అయితే ఇటీవల ఎగుమతులను చైనా నిలిపివేసింది.

### సగం వాటా యూరియాదే..

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా మొత్తం 6.55 కోట్ల టన్నుల ఎరువులను వినియోగించారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26)లో ఎరువుల వినియోగం 7 కోట్ల టన్నులు దాటిందని అంచనా.
- దేశంలో వాడే ఎరువుల్లో సగం వాటా యూరియాదే. 2023–24లో 3.57 కోట్ల టన్నులు, 2024–25లో 3.87 కోట్ల టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయి. 2025–26లో 3.90 కోట్ల టన్నుల అమ్మకాలు జరగవచ్చని అంచనా.





### దేశంలో ఉత్పత్తి ఎక్కువే..

దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని పెంచేందుకు గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఏటేటా దేశీయ ఉత్పత్తి పెరుగుతూ వస్తున్నది. అయితే ఉత్పత్తి పెరిగినప్పటికీ, వినియోగం కూడా పెరగడంతో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది.

- 2021లో దేశంలో ఎరువుల ఉత్పత్తి 4.33 కోట్ల టన్నులు.
- 2024 నాటికి 5.09 కోట్ల టన్నులు, 2025 నాటికి 5.24 కోట్ల టన్నులకు ప్రొడక్షన్ పెరిగింది.
- ప్రతిఏటా దాదాపు 2 కోట్ల టన్నుల కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తున్నది.

### బఫర్ స్టాక్ తక్కువే..

- 2026 మార్చి 19 నాటికి కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న మొత్తం ఎరువుల స్టాక్ 1.8 కోట్ల టన్నులు.
- ఇందులో యూరియా 61 లక్షల టన్నులు. డీఏపీ 24 లక్షల టన్నులు. ఎన్పీకే 57 లక్షల టన్నులు.
- సాధారణంగా ఖరీఫ్ (వానాకాలం) సీజన్ జూన్‌లో మొదలవుతుంది. అంటే ఇంకో రెండు నెలల టైమ్ ఉంది.
- ఖరీఫ్‌లో ఆగస్టు వరకు దాదాపు 2 కోట్ల టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఇప్పుడు కేంద్రం వద్ద 61 లక్షల టన్నులు రెడీగా ఉంది. ఆగస్టు వరకు మరో కోటి టన్నులు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. అంటే మరో 20 లక్షల టన్నులు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది.
- ఒకవేళ యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే.. ఎల్ఎన్‌జీ సప్లయ్ నిలిచిపోయి యూరియా ప్లాంట్లు నడవక ఉత్పత్తి మరింత పడిపోతుంది. దిగుమతులపైనా ప్రభావం పడుతుంది. అదే జరిగితే యూరియా సంక్షోభం తలెత్తే ముప్పు ఉంది.





**దేశంలోని యూరియా ప్లాంట్లు: 33**

**వీటి ప్రొడక్షన్ కెపాసిటీ: 2.69 కోట్ల టన్నులు (ఏటా)**

**దేశంలో యూరియా డిమాండ్, ఉత్పత్తి, వినియోగం (కోట్ల టన్నుల్లో)**

| ఏడాది | డిమాండ్ | ఉత్పత్తి | వినియోగం |
|---|---|---|---|
| 2022–23 | 3.59 | 2.84 | 3.57 |
| 2023–24 | 3.56 | 3.14 | 3.57 |
| 2024–25 | 3.64 | 3.06 | 3.64 |
| 2025–26 (ఫిబ్రవరి వరకు) | 3.66 | 2.75 | 3.66 |

**వివిధ ఎరువుల దిగుమతులు ఇలా.. (లక్షల టన్నుల్లో)**

| ఏడాది | యూరియా | డీఏపీ | ఎంవోపీ |
|---|---|---|---|
| 2022–23 | 75.80 | 65.83 | 18.66 |
| 2023–24 | 70.42 | 55.67 | 28.69 |
| 2024–25 | 56.47 | 45.69 | 35.41 |